క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశాలు

మదనపల్లె: మదనపల్లె మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలను సోమవారం నిర్వహిస్తున్నారు. సాధారణ కౌన్సిల్ సమావేశం సాయంత్రం 3:30 గంటలకు నిర్వహించడానికి నిర్ణయించగా, అత్యవసర సమావేశాన్ని సాయంత్రం 4 గంటలకు నిర్వహించేలా నిర్ణయించి ఆదివారం అంజెండా కాపీలను అధికారులు కౌన్సిల్‌కు పంపిణీ చేశారు.

డీఎల్‌పీఓ విచారణ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని నవాబుకోట సచివాలయంలో పని చేసే ఓ మహిళా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్య ధోరణిపై డీ.మంజునాథ్ అనే వ్యక్తి ఇటీవల సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. దీంతో విచారించాలని సీఎంవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మదనపల్లి డీఎల్‌పీవో నాగరాజు, ఇన్‌చార్జి ఈవోఆర్డీ మోహన్ ప్రతాప్ శనివారం నవాబుకోట సచివాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్‌పీవో ఆదివారం వెల్లడించారు.

ఆకట్టుకున్న హరికథా గానం


హరికథాగానం చేస్తున్న కళాకారుడు

రామసముద్రం: మండలంలోని కేసీ పల్లి పంచాయతీ గుంతయంబాడి గ్రామంలోని రామాలయం వద్ద శనివారం రాత్రి హరికథాగానం నిర్వహించారు. శ్రీ వెంకటరమణ భాగవతార్ శ్రీనివాస కల్యాణం ప్రవచనం అందరిని ఆకట్టుకుంది. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక మానసిక ప్రశాంతతకు హరికథ దోహదపడుతుందని, ఎప్పటికీ హరికథకు ఆదరణ తగ్గదని గ్రామస్తులు తెలిపారు.

యల్లమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన పలువురు భక్తులు మంగళవాయిద్యాలతో బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మెరుగైన విద్యాబోధనే లక్ష్యం


రాధారాణి

పీలేరురూరల్ : విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తామని జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాసునూరి రాధారాణి తెలిపారు. జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వాసునూరి రాధారాణి నియమించారు. స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో జ్యోతిబా పూలే పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఈమె డీఎస్సీలో రాష్ట్ర స్థాయిలో 50వ ర్యాంకు సాధించి ప్రిన్సిపాల్‌గా ఎన్నికయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రిషిత ప్రియాప్రవల్లిక స్వాతి

తంబళ్లపల్లె: రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల షూటింగ్‌బాల్ జట్టులో కన్నెమడుగు బాలికలు చోటు దక్కించుకున్నట్లు హెచ్‌ఎం మదన్‌మోహన్, పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. ఆదివారం మదనపల్లె గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో జూనియర్ షూటింగ్ బాల, బాలికల జట్టు ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా బాలికల జట్టులో కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి రిషిత, ప్రియాప్రవల్లిక, స్టాండ్‌బైగా స్వాతి చోటు దక్కించుకున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బాలికలను సర్పంచు శివకుమారి, ఎంపీటీసీ మహేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ రెడ్డిశేఖర్, ఎంఈఓలు త్యాగరాజు, సుబ్బరాయుడు అభినందించారు.

ఠాగూర్ కాటేజీని స్మారక కేంద్రంగా మార్చాలి

మదనపల్లె సిటీ: బీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ కాటేజీని కేంద్ర స్మారక కేంద్రంగా మార్చాలని బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, అజ్మతుల్లాఖాన్, విజయభారతి సేతులు కేంద్ర గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఆదివారం వారు తిరుపతిలో మంత్రిని కలిశారు. బీటీ ప్రభుత్వ కాలేజీలో విశ్వకవి రవీంద్రుడు బస చేసి జాతీయగీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఠాగూర్ కాటేజీని పూర్వ వైభవం తీసుకోవాలని కోరారు. మంత్రి స్పందిస్తూ కేంద్రస్మారక కేంద్రంగా చేస్తానని హామీ ఇచ్చారు.

వసతులు కరువు.. చదువులు బరువు

- నరకప్రాయంగా వసతి గృహాలు
- అద్దె భవనాలతో అవస్థలు
- అధ్వానంగా మరుగుదొడ్లు, బాత్ రూంలు


ఇరుకు గదిలో విద్యార్థులు

మదనపల్లె సిటీ: రేకుల షెడ్లు, నేలపైనే పడకలు, ప్రాంగణాల్లో క్షీణించిన పారిశుద్ధ్యం. ఇదీ మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ బాలుర కాలేజీ వసతి గృహాల పరిస్థితి. విద్యార్థులు అవస్థల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. మదనపల్లె పట్టణంలో నాలుగు ప్రభుత్వ కాలేజీ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో బీసీ, గిరిజన, ఎస్సీ కాలేజీ హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తుండగా, మహిళా హాస్టల్ ప్రభుత్వ భవనంలో కొనసాగుతోంది. స్థానిక సురభికాలనీలోని బీసీ బాలుర కాలేజీ హాస్టల్ భవనం రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. అద్దె భవనం కావడంతో సమస్యలు అధికంగా ఉన్నాయి. ఊరి బయట కావడంతో భవనం చుట్టూ కంప చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. హాస్టల్‌లో గదులకు తలుపులు, కిటికీలకు తలుపులు లేవు. ఇరుకుగదుల్లో విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. మూడు గదుల్లో నేలపైనే పడుకుంటున్నారు.

అపరిశుభ్రంగా పరిసరాలు

దోమల బెడదతోపాటు విషసర్పాలు సంచరిస్తున్నాయి. హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. బాత్‌రూములు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు, స్థానిక కదిరిరోడ్డులోని గిరిజన బాలుర వసతి గృహం అద్దె భవనంలో నడుస్తుంది. రేకుల షెడ్డు కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 80 మంది విద్యార్థులకు కింద షెడ్డులో 30 మంది, పైన రెండు రేకుల షెడ్డులో విద్యార్థులు ఉన్నారు. నేలపైనే పడుకుంటున్నారు. రేకుల షెడ్డు కావడంతో విద్యార్థులు అవస్థల మధ్య కాలం వెళ్ల దీస్తున్నారు. బాత్‌రూములు, మరుగుదొడ్లు సరిపడకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలో ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ నడుస్తుంది. అద్దె భవనం పాతది కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇరుకుగదుల్లో కాలం వెళ్లదీస్తున్నారు. కాలేజీ బాలుర వసతిగృహాలు అద్దె భవనాల్లో నడుస్తున్నా అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు.

సమస్యలు పరిష్కరించాలి



మదనపల్లెలోని కాలేజీ బాలుర హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి. రేకుల షెడ్డుల్లో హాస్టళ్ల నిర్వహిస్తున్నారు. వసతిదారుణంగా ఉంది. ఇలాంటి చోట విద్యార్థులు చదువుకోవాలన్న కష్టమే. అధికారులు స్పందించి సొంత భవనాలు నిర్మించాలి.

–నరసింహ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దాం

తంబళ్లపల్లె: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. ఆదివారం కోసువారిపల్లె పంచాయతీ సింగారెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు రామ్మూర్తి మనువడి జన్మదిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యేను శాలువలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. చిన్నారిని ఎమ్మెల్యే ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి నాయకులు మహేష్, కిషోర్‌రెడ్డి, సురేంద్రనాథ్, కోటిరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

మదనపల్లె: మదనపల్లెలో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సీపీ సుబ్బారెడ్డి సోదరుడు సీపీ వేణుగోపాల్‌రెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు దేశాయ్ తిప్పారెడ్డి, నవాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్, ఏపీఎండీసీ మాజీ చైర్మన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జి.షమీం అస్లాం, మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ హాజరై ఆశీస్సులు అందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

బి.కొత్తకోట: ములకలచెరువు మండలం దేవలచెరువు సర్పంచ్ చక్రపాణి నాయుడును ఆదివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పరామర్శించారు. ఇటీవల తేనేటీగలు దాడి చేయడంతో గాయపడిన సర్పంచు మదనపల్లెలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.


వధూవరులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నాయకులు

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం


మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలికిరి(వాల్మీకిపురం): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేసే వారికి పార్టీ పదవులు కేటాయించడం జరిగిందన్నారు. ప్రజల తరఫున పోరాడటానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నూతన పింఛన్లు ఇవ్వక పోగా విచారణ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తూ ప్రత్యేక ప్రతిభావంతులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఏడాదిన్నరలోనే కూటమి ప్రభుత్వం తీవ్ర స్థాయిలో ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుందని, ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీలో నూతనంగా నియమితులైన జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి రాంపల్లి రమేష్‌బాబు, మండల ఉపాధ్యక్షులు రాంపల్లి రామనాథం, మంచూరు గ్రామ కమిటీ అధ్యక్షులు నగిరిమడుగు సోమశేఖర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సన్మానించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శివానందరెడ్డి, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, సయ్యద్ బాషా, ముబారక్, గోవర్ధన్, కిశోర్, వెంకటస్వామిరెడ్డి, నరసింహులు,నాగరాజపాల్గొన్నారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సర్వీసులో స్త్రీ శక్తి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునన్నారు. ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎస్ అసోసియేషన్ నాయకులు

లేరు : పాతన పెన్షన్ విధానం కొనసాగించాలనే డిమాండ్ సెప్టెంబర్ 1న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ అన్నారు. ఆదివారం చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. నాయకులు కిషోర్ కుమార్, అమరనాథ్, యర్రయ్య, ఈశ్వరయ్య, విజయ్‌కుమార్, జోహార్ పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం


నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా, వార్డుమెంబర్లు

పీలేరు రూరల్ : కూటమి ప్రభుత్వ కుట్రలో భాగంగానే రాజంపే ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. ఆదివారం ఎంపీ అక్రమ నిర్బంధానికి 37వ రోజు అయిన నేపథ్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజాదరణ కలిగిన పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు బనాయించడం, వేధించడం రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగమేనని విమర్శించారు. తామంతా పెద్దిరెడ్డి కుటుంబం వెన్నంటే ఉంటామని తెలిపారు. వార్డు మెంబర్లు ఉదయ్‌కుమార్, నాగభూషణం, మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, సచిన్, కాలేషా, విక్టరీ వెంకటరమణారెడ్డి, శ్రీనాథరెడ్డి, పరమేష్,అబీద్, రమణ, షాజహాన్, నాగరాజ నాయక్ పాల్గొన్నారు.

మదనపల్లెలో ట్రాఫిక్ ఆంక్షలు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని సీటీఎం రోడ్డు, తిరుపతి మార్గంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ గురునాథ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరువుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తిరుపతి, వాయల్పాడు, కలికిరి మార్గంలో వెళ్లే బస్సులను జెడ్పీహైస్కూల్, సంతగేటు, బెంగళూరు బస్టాండు, కదిరిరోడ్డు, నీరుగట్టువారిపల్లె అన్నమయ్యసర్కిల్ బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించినట్లు చెప్పారు. అలాగే తిరుపతి నుంచి పట్టణంలోకి వచ్చే బస్సులు తట్టివారిపల్లె మీదుగా కాకుండా వెంగమాంబ సర్కిల్ నుంచి అన్నమయ్యసర్కిల్ బైపాస్‌రోడ్, నీరుగట్టువారిపల్లె, కదిరిరోడ్డు, ఎన్‌టీఆర్ సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండులోకి వస్తాయన్నారు. ప్రజలు, ప్రయాణికులు ఈ మార్పును గమనించి పోలీసుశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ యుగంధర్

పీలేరు : వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని పీలేరు సీఐ యుగంధర్ అన్నారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పీలేరు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వినాయక ఉత్సవాలు సామూహికంగా జరుపుకోవడం పీలేరులో ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇంతపెద్ద ఎత్తున జరిగే కార్యక్రమంలో అందరూ సమయపాలన పాటించాలన్నారు. ఈ నెల 31న ఊరేగింపు, నిమజ్జనం ఉంటుందని, పట్టణంలో రోడ్డు పనులు జరుగుతున్నాయని, వీలైనంత త్వరగా నిమజ్జనం అయ్యేలా భక్తులు, ప్రజలు సహకరించాలని కోరారు. గణేష్ ఉత్సవాల్లో భక్తి పాటలు మాత్రమే పెట్టాలని సూచించారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ములకలచెరువు: మండలంలోని గూడుపల్లె, కాలువపల్లె తారురోడ్డు పనులకు ఆదివారం టీడీపీ తంబళ్లపల్లె నాయకులు జయచంద్రారెడ్డి, కాంట్రాక్టర్ జి.క్రిష్ణమోహన్‌నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ రెండు రోడ్డు పనులను రూ. 12.57 కోట్లతో ఈ పూర్తి చేయనున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న డీఎస్పీ మహేంద్ర, పోలీసు సిబ్బంది.

మదనపల్లె రూరల్ : యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డీఎస్పీ మహేంద్ర అన్నారు. ఆదివారం ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారని పేర్కొన్నారు. యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా వీటిని దూరం చేయవచ్చన్నారు. విధుల్లో భాగంగా పోలీసులు నిత్యం ఒత్తిడికి గురవుతుంటారని, ఇది శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం కనపరుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో యోగా గొప్ప పరిష్కారాన్ని చూపుతుందన్నారు. ప్రతిరోజు యోగ సాధన ద్వారా ఆరోగ్యం పొందడమే కాకుండా మానసిక ఆనందం పొందవచ్చన్నారు. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా అందరూ ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సిబ్బందికి సూచించారు. . సీఐలు రఫీ, కళావెంకటరమణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం


సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీకే, బాస్ నాయకులు

మదనపల్లె రూరల్ : భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) అగ్రనేత, కమ్యూనిస్టు యోధుడు, కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరనిలోటని విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ తెలిపారు. పట్టణంలోని బాస్ కార్యాలయంలో ఆదివారం సురవరం సుధాకరరెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. వీసీకే, బాస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కామ్రేడ్ సుధాకరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డికి పెద్దనాన్న అయిన సురవరం ప్రతాపరెడ్డి నుంచి కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, తన తండ్రి నుంచి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకుని అసమానతల అంతం కోసం తుదిశ్వాసవరకు అలుపెరుగని పోరాటం చేసిన విప్లవయోధుడని కొనియాడారు. సుధాకరరెడ్డి మృతికి సంతాపం ప్రకటించి, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాస్ రాష్ట్ర అధ్యక్షులు యు.గణపతి, అధికార ప్రతినిధి ముత్యాలమోహన్, కోశాధికారి నీరుగట్టి రమణ, ఉపాధ్యక్షుడు వి.దొరస్వామి, బయన్న, రెడ్డెప్ప, డేగాని రమణ, జి.వి.రమణ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


చెత్త సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

గుర్రంకొండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ ఈవో శ్రీహరి సూచించారు. ఆదివారం పట్టణంలోని పలువీధుల్లో చెత్తసేకరణ కార్యక్రమం చేపట్టారు. చెత్తబండి వాహనంతోపాటు అధికారులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి స్వయంగా చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్య, వీధుల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త పారవేయవద్దన్నారు. తద్వారా పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు, క్రిమికీటకాలు పెరిగి అనే రోగాలు వ్యాపిస్తాయని పేర్కొన్నారు. ఇళ్లలోనే పొడిచెత్త, తడిచెత్తను వేర్వేరుగా చెత్తకుండీల్లో వేసుకోవాలన్నారు. ప్రతిరోజు వీధుల్లోకి చెత్తబండి వాహనం వస్తుందన్నారు. ఇళ్లలోని చెత్తను చెత్తబండి సిబ్బందికి అందజేస్తే ప్రతిరోజు చెత్తతో సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిసార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దేవరఎద్దుకు అంత్యక్రియలు


దేవర ఎద్దుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

మదనపల్లె రూరల్ : మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ టీకులపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన దేవర ఎద్దుకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. 20 ఏళ్ల క్రితం గ్రామస్తులు ప్రస్తుతం మృతిచెందిన ఎద్దును దేవర ఎద్దుగా ఎంపికచేశారు. అప్పటి నుంచి గ్రామంలో జరిగే ఉత్సవాలు, వేడుకల్లో దేవర ఎద్దుకు ప్రాధాన్యత ఇస్తూ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో దేవర ఎద్దు వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురై శనివారం రాత్రి మృతి చెందింది. దీంతో గ్రామస్తులు దేవర ఎద్దుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఇంట్లోని కుటుంబసభ్యులకు ఏ విధంగా అంత్యక్రియలు నిర్వహిస్తారో...అంతకంటే ఎక్కువగా గ్రామస్తులందరూ కలిసికట్టుగా మేళతాళాలు, పిల్లనగ్రోవి, డప్పువాయిద్యాలతో, ఉత్సవ గొడుగులు మోస్తూ ఊరేగింపు చేసి దేవర ఎద్దుకు గ్రామపొలిమేరలో ఘనంగా అంత్యక్రియలు పూర్తిచేశారు.

రక్తదానం ఆరోగ్యానికి మంచిది


రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమారీ సభ్యులు

మదనపల్లె సిటీ: రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని ప్రజాపిత బ్రహ్మకుమారీ మదనపల్లె బ్రాంచి సంచాలకులు పద్మావతి అన్నారు. ఆదివారం స్థానిక కోటవీధిలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ విద్యాలయంలో దాదీ ప్రకాష్‌మణిజీ 18వ వర్ధంతి పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందు రావాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి డి.ఆర్.జగదీష్, సుభద్ర, వివేక ఆశయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భానుప్రకాష్, బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు ఉమాదేవి, బాలాజీ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రామసముద్రం: మండలంలోని కేసీపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2014–15 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల సమ్మేళనం (గెట్‌– టుగెదర్) నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. అలాగే పాఠశాలకు వాటర్ ఫిల్టర్, క్రీడా సామగ్రి సమకూర్చారు. తమకు మంచి విద్యను బోధించి క్రమశిక్షణ నేర్పిన ఉపాధ్యాయులకు తాము రుణపడి ఉంటామని పేర్కొన్నారు. పది సంవత్సరాల తర్వాత ఒకే దగ్గర కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు అప్పటి మధురజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథుడు

- ఆధునిక డిజైన్లతో ఆకట్టుకునే విధంగా విగ్రహాల తయారీ
- గ్రామాల్లో చవితి సందడి

కురబలకోట: బొజ్జగణపయ్య చవితి వేడుకలకు సిద్ధమవుతున్నాడు. పిల్లా–పెద్దా అందరూ కలిసి ఆనందంగా జరుపుకునే పండుగల్లో వినాయకచవితి ఒకటి. ఆ వినాయకుడి పూజకు ప్రధానంగా కావాల్సింది ప్రతిమలే. గృహాల్లో మట్టి గణపయ్యను పెట్టుకుని వ్రతాన్ని పూర్తి చేసుకున్నా మండపాలు కట్టి ఐదు లేక తొమ్మిది రోజుల పాటు పూజలు చేయాలనుకునేవారు ఖచ్చితంగా పెద్ద విగ్రహాల కొనుగోళ్లపైనే దృష్టిసారిస్తారు. ఈనెల 27న వినాయకచవితి పర్వదినం సందర్భంగా పూజలు అందుకునేందుకు గణనాథుల ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వాడవాడలా గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేరాఫ్ కంటేవారిపల్లె

సాధారణంగా వినాయక బొమ్మలంటే తంబళ్లపల్లె, మదనపల్లె నియోజక వర్గాలతో పాటు పక్కనున్న



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

కర్నాటక వాసులకు ఠక్కున గుర్తుకు వచ్చేది కురబలకోట మండలంలోని కంటేవారిపల్లె. ఇక్కడ కొన్నేళ్లుగా టెర్రకోట కళాకారులు వినాయక విగ్రహాల తయారీ, విక్రయాల్లో ప్రసిద్ధి చెందారు. వివిధ రకాల ప్రతిమలు సిద్ధం చేశారు. వీటి అమ్మకాలు కూడా ఊపందుకున్నాయి. ఇప్పటికే వివిధ గ్రామాల వారు ఆర్డర్లు బుక్ చేసుకుంటున్నారు. మరికొందరు గ్రామాలకు విగ్రహాలను తరలిస్తున్నారు. ఈ సారి నిమజ్జనానికి నీళ్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. పండగను సెలబ్రెట్ చేసుకునేందుకు వేలు నుండి లక్షలు ఖర్చుపెట్టడానికి కూడా యువత ఉత్సాహం చూపుతోంది.

కోలాహలంగా..

పీలేరురూరల్ : పీలేరులో గణేష్ ఉత్సవాల సందడి మొదలైంది. వినాయక చవితి ఉత్సవాలు హైదరాబాద్ తరువాత పీలేరులో పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పీలేరులో వందకు పైగా గణేష్ మండపాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని చిత్తూరు రోడ్డు, కడప రోడ్డు మార్గంలో గణేష్ తయారీ కేంద్రాల వద్ద విగ్రహాల కొనుగోలుకు పెద్ద ఎత్తున భక్తులు ఎగబడుతున్నారు. విగ్రహాలు కొనుగోలు చేసి కోలాహలంగా తరలిస్తున్నారు.

బడ్జెట్‌కు అనుగుణంగా తయారీ



వివిధ రకాల సైజుల్లో విగ్రహాలు తయారు చేశాం. రూ.50 ల నుంచి రూ. 50 వేల వరకు బొమ్మలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. బడ్జెట్‌కు అనుగుణంగా ప్రతిమలు తయారు చేశాం. విగ్రహాల తయారీని మేము వ్యాపారంగా చూడలేదు. నిర్వాహకులు బొమ్మను చూసి ఆనందపడితే చాలు. సంతృప్తి పడతాం.

–అనసాపురం బాలాజీ, విగ్రహ తయారీదారుడు కంటేవారిపల్లె